తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక





హైదరాబాద్ గురువారం 30 - 07 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజిలు : 4


# కింద పడి పొర్లాడినా..
# నేను చెప్పిందే నడుస్తది

## తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్



- దళితబంధు ఇప్పిస్తా.. కానీ కొంత సమయం పడుతుంది
- గత ప్రభుత్వం ఓట్ల కోసం దళితబంధు ఇచ్చారు
- కానీ దళితులు ఓట్లన్నీ నాకే వేశారు

**ప్రజావారధి/మోత్కూరు**

దళితబంధు ఇప్పిస్తానని..కానీ కొంత సమయం పడుతుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దళితబంధు టెక్నికల్ సమస్యతో నిలిచిపోయిందని, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో పాటు ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్కతో మాట్లాడతానన్నారు. గత ప్రభుత్వం దళితుల ఓట్ల కోసం దళితబంధు పెట్టిందని, కాంగ్రెస్‌ను ఓడించేందుకు ఉపాయం చేసినా అది నడవలేదన్నారు. ఎన్నికల ముందు దళితులకు ఆశపెట్టి ఒక్కొక్కరి అకౌంట్లలో రూ.3 లక్షలు వేశారని, దళితుల ఓట్లు పడతాయని ఆశ పడ్డారని, కానీ దళితులంతా ఓట్లన్నీ నాకే వేశారన్నారు. మంది మాటలు పట్టుకుని మార్వానం పోతే..మళ్లొచ్చేసరికే ఇల్లు ఆగమైందట అన్నట్టుగా మంది మాటలు విని అక్కడికో, ఇక్కడికో తీసుకపోయి ఇప్పిస్తానంటున్న వారితో ఏం జరగదని, ఏది జరగాలన్న ఎమ్మెల్యే సామేల్‌తోనే జరుగుతుందన్నారు. దళితబంధు వచ్చిన వాళ్లలో కూడా పేదవాళ్లే ఉన్నారన్నారు. కాంగ్రెస్‌ను తూలనాడే వారిని సహించేది లేదని, సామాన్య కార్యకర్త స్థాయి నుంచి నేను అందరి కష్టాన్ని, బాధలను చూసిన వాడినని, సామేల్ మడమ తిప్పని పోరాటయోధుడన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలనలో భాగమై పనిచేస్తున్నానని, నాయకులు, కార్యకర్తలు ఏ పని ఉన్నా నేరుగా తన వద్దకే రావచ్చన్నారు. మోత్కూరుతో పాటు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకుందామన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



- చైర్మన్, కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం
- బిల్లులు విషయంలో తీవ్ర వాగ్వి వాదం
- పలు బిల్లులను తిరస్కరించిన కౌన్సిలర్లు
- అన్నింటికీ ఆమోదం చెప్పాల్సిందేనన్న చైర్మన్
- మినిట్స్ బుక్‌లో సంతకాలపై అయోమయం

# వాడివేడిగా మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్




**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం వాడివేడిగా జరిగింది. చైర్మన్ గడ్డం స్వప్నసోమనర్సయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించగా మున్సిపల్ కమిషనర్ నర్సయ్య బిల్లులు, తీర్మానాలను చదివి వినిపించారు. ఎజెండాలో పెట్టిన అంశాలపై చర్చ సందర్భంగా చైర్మన్, కౌన్సిలర్ల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. ఇష్టానుసారంగా బిల్లులు పెట్టి డ్రా చేసుకుంటున్నారని, చేయని పనులకు కూడా బిల్లులు పెడుతున్నారని, మీ భర్త పెత్తనం ఎక్కువ చేస్తున్నారని, మేం చెప్పిన పనులేవీ చేయడం లేదని కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్ కౌన్సిలర్లు చైర్మన్‌ను నిలదీశారు. పని చేయకుండా ఏ బిల్లు పెట్టడం లేదని, ఇష్టమొచ్చినట్టు బిల్లులు ఎవరు డ్రా చేస్తున్నారని, మున్సిపల్ కార్యాలయానికి నేనే వస్తున్నానని చైర్మన్ స్వప్న వారికి ప్రతిగా స్పందించారు. ఇరువర్గాల మధ్య మాటల యుద్ధంతో కొంతసేపు మీటింగ్‌తో గందరగోళం నెలకొన్నట్టు తెలిసింది. 29 బిల్లులను ఆమోదం కోసం పెట్టగా చర్చ సందర్భంగా ప్రైవేట్ వ్యక్తుల వాహనాల్లో పోసిన డీజిల్ ఖర్చును కూడా మున్సిపల్ లెక్కల్లో రాశారని ఆరోపించారు. డోజర్, జేసీబీతో ఎక్కడ పని చేయించారని లక్షల్లో బిల్లు పెట్టారని, ఎక్కడ ఎన్ని గంటలు పని చేయించారో రికార్డులు చూపించాలని, ఎన్నికల ఖర్చు లెక్కలు చెప్పాలని కౌన్సిలర్లు ప్రశ్నించారు. పబ్లిక్ టాయ్‌లెట్లే ఉపయోగంలో లేవని, వాటి నిర్వహణకు ఖర్చు చేశారని బిల్లు ఏ విధంగా పెడతారని ప్రశ్నించినట్టు తెలిసింది. శానిటేషన్ పరికరాల కొనుగోలులో కూడా తమకు అనుమానాలు ఉన్నాయని, వాటిపై సమాధానం చెప్పాలన్నారు. కొన్ని బిల్లులను ఆమోదించినప్పటికీ ఎన్నికల నిర్వహణ ఖర్చు రూ.30 లక్షల 86776, డోజర్, జేసీబీ వర్క్ చేసిన ఖర్చు రూ.9 లక్షల 23105, డీజిల్ బిల్లు రూ.8 లక్షల 32879లను ఆమోదించకుండా తిరస్కరించినట్టు కౌన్సిలర్లు తెలిపారు. డివైడర్ల మధ్యలో మొక్కల పెంపకం కోసం, వన మహోత్సవంలో 38 వేల మొక్కలు నాటేందుకు రూ.15 లక్షలు, ఆఫీస్ స్టేషనరీ రూ.3 లక్షలు, ఎల్ఈడీ లైట్ల కొనుగోలు, రూ.35 లక్షలతో రెండు ఎలక్ట్రికల్ శానిటేషన్ ఆటోలు, రూ.42 లక్షలతో జేసీబీని కొనుగోలు చేయడం సహా 9 తీర్మానాలు పెట్టగా వాటిని ఆమోదించినట్టు తెలిసింది. కాగా కౌన్సిలర్లు తిరస్కరించిన ఎన్నికల ఖర్చు రూ.30.86 లక్షలు, డోజర్, జేసీబీ ఖర్చు రూ.9.23 లక్షలు ఆమోదించినట్టు మున్సిపల్ కమిషనర్ నర్సయ్య ప్రెస్‌నోట్‌లో ప్రకటించారు. కొత్త కౌన్సిల్ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ఆర్థిక లావాదేవీలకు సంబంధించి రూ.ఒక కోటి 46 లక్షలు చెల్లింపులు చేసినట్టు కమిషనర్ తెలిపారు. కౌన్సిల్‌లో 10 అంశాలను పెట్టగా ఏకగ్రీవంగా తీర్మానించారన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, కౌన్సిలర్లు కుర్మిళ్ల ప్రమీలరాములు, సుల్తాన్ స్వామి, కొండా శోభసోంమల్లు, మొగుళ్ల అనురాధశ్రీనివాస్‌రెడ్డి, గనగాని శైలజనర్సింహ, పన్నాల శ్రీవిద్యశ్రీనివాస్‌రెడ్డి, బీసు శ్రీకాంత్, నల్ల మధు, కారుపోతుల వెంకన్న, మెంట రమణనగేష్, మున్సిపల్ మేనేజర్ షాహబాజ్, అకౌంటెంట్ మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.

## మినిట్స్ బుక్‌లో సంతకాలపై అయోమయం

కౌన్సిల్ సమావేశం ముగిసిన తర్వాత మున్సిపల్ కమిషనర్ మినిట్స్ బుక్‌లో కౌన్సిలర్ల సంతకాలు తీసుకోకపోవడంతో అయోమయం నెలకొంది. సమావేశం ముగిసిన తర్వాత మినిట్స్ బుక్ ఏదని, సంతకాలు తీసుకోరా అని కౌన్సిలర్లు ప్రశ్నించగా మీ సంతకాలు అవసరం లేదని, మేం రాసుకుంటామని చెప్పడంతో అలా ఎలా రాసుకుంటారని, మేం ఆమోదం చెప్పని నిధులకు, పనులను కూడా రాసుకుంటే ఎవరు బాధ్యులని కౌన్సిలర్లు ప్రశ్నించారు. కమిషనర్‌ను పిలిపించి మినిట్స్ బుక్‌పై అడగ్గా మినిట్స్ బుక్ ఏమీ ఉండదని చెప్పడంతో గత కమిషనర్ మినిట్స్ బుక్‌లో కౌన్సిల్‌లో చర్చించిన అంశాలు రాసి ఆమోదించిన వాటికి సంతకాలు తీసుకున్నారని కౌన్సిలర్లు చెప్పారు. దీంతో మినిట్స్ బుక్‌లో సంతకాలపై అయోమయం నెలకొంది.

## రూ.15 కోట్ల నిధుల్లో..

# వార్డుకు రూ.కోటి నిధులు ఇవ్వాలని అడిగాం

## బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లు



- ఆ నిధులతో మీకు సంబంధం లేదని ఎమ్మెల్యే చెప్పడం భావ్యం కాదు
- మున్సిపల్ బిల్లుల్లో అన్ని అవినీతి, అక్రమాలే
- సోలార్ ప్లాంట్ నుంచి చైర్మన్ భర్త రూ.1.50 లక్షలు తీసుకున్నాడని ఆరోపణ

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మున్సిపల్ రూ.15 కోట్ల నిధుల్లో వార్డుకు రూ.కోటి చొప్పున నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యే సామేల్‌ను కోరామని బీఆర్ఎస్ కౌన్సిలర్ నల్ల మధు తెలిపారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు సుల్తాన్ స్వామి, కొండా శోభసోంమల్లుతో కలిసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.15 కోట్ల నిధులకు సంబంధించి ఇప్పటికే రెండుసార్లు టెండర్లు రద్దయ్యాయని, మరోసారి అదే పరిస్థితి తలెత్తకుండా ప్రతి వార్డుకు రూ.కోటి నిధులు ఇచ్చి సహకరించాలని ఎమ్మెల్యేను కోరామన్నారు. ఆ నిధులతో మీకు ఏం సంబంధం లేదని ఎమ్మెల్యే చెప్తున్నారని, మున్సిపాలిటీకి వచ్చిన నిధులు కౌన్సిలర్లకు సంబంధం లేకపోతే మరెవరికి ఉంటుందని ప్రశ్నించారు. ఎన్నికల్లో వార్డుల్లో డెవలప్‌మెంట్ పనులు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చామని, ప్రజలు పనులపై తమను అడుగుతున్నారని, ఎమ్మెల్యే నిధులపై ఏకపక్షంగా వ్యవహరించడం భావ్యం కాదన్నారు. మున్సిపాలిటీ లెక్కల్లో, బిల్లుల చెల్లింపుల్లో అన్నీ అక్రమాలే ఉన్నాయని, పెట్టిన బిల్లుల్లో రూ.లక్షల్లో తేడాలు ఉన్నట్టు గుర్తించామని, కొన్నింటికి ఆధారాలతో సహా వెల్లడించామన్నారు. మున్సిపాలిటీని నుంచి అనుమతులు లేకుండానే బుజిలాపురంలో సోలార్ ప్లాంట్ నుంచి చైర్మన్ భర్త రూ.1.50 లక్షలు తీసుకున్నారని, దీంతో మున్సిపాలిటీకి వచ్చే ఆదాయానికి గండి పడుతుందన్నారు. జేసీబీ, డోజర్ పని చేసినట్టు రూ.9 లక్షలకుపైగా బిల్లు పెట్టారని, తాము లెక్క అడిగితే ఐదారు లక్షలకు మించి చెప్పలేదని, అంత బిల్లు ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. గ్రావెల్ పేరుతో రూ.5.60 లక్షలు, ప్రైవేట్ వ్యక్తుల కార్లకు పోసిన డీజిల్‌ను కూడా మున్సిపల్ లెక్కల్లో కలిపి రూ.8 లక్షలకు పైగా చూపుతున్నారని, తప్పుడు డీజిల్ బిల్లులను కూడా చూపించామన్నారు. డెవలప్‌మెంట్ పనులకు మేం నిధులు అడిగితే నిధులు లేవంటున్నారని, కానీ తప్పుడు లెక్కలతో అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ రూ.లక్షల్లో బిల్లులు డ్రా చేస్తున్నారని ఆరోపించారు. కౌన్సిలర్లకు చెప్పకుండానే డబ్బులు తీసుకుని కొత్త సిబ్బందిని పెట్టుకున్నారని తెలిపారు. ఎక్కువ మొత్తంతో చేసే పనులను కౌన్సిలర్లకు చెప్పి చేయాల్సి ఉండగా ఏ మాత్రం సమాచారం ఇవ్వడం లేదన్నారు. మున్సిపాలిటీలో అవినీతి, అక్రమాలకు తావు లేకుండా, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, రూ.15 కోట్ల నిధుల్లో ప్రతివార్డుకు నిధులు ఇవ్వాలని కోరారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
30 - 07 - 2026



- ఎమ్మెల్యే సహకారం లేకపోవడంతోనే దళితబంధు ఆగింది
- ఏడాది క్రితమే ప్రభుత్వం జీవో ఇచ్చింది
- ఇతర ఏ స్కీంలకు దరఖాస్తు చేసుకోలేకపోతున్నాం

### ఎమ్మెల్యేకు దళితులపై ప్రేమ ఉంటే..

# నెలరోజుల్లో దళితబంధు ఇప్పించండి

## మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేందర్‌నాథ్

**ప్రజావారధి/మోత్కూరు**

దళిత బిడ్డ అయిన తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు ఏ మాత్రం దళితులపై ప్రేమ ఉన్నా నెల రోజుల్లో దళితబంధు ఇప్పించాలని మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేందర్‌నాథ్ కోరారు. మోత్కూరులో బుధవారం దళితబంధు లబ్ధిదారులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. దళితబంధు ఇప్పిస్తానని ఎమ్మెల్యే సామేల్ హామీ ఇస్తున్నప్పటికీ రెండున్నరేళ్లుగా లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదని, నిజంగా ఎమ్మెల్యేకు దళితపై ప్రేమ ఉంటే రెండున్నరేండ్ల కిందటే ఖాతాలపై ఉన్న ఫ్రీజింగ్ ఎత్తేయించేవారన్నారు. ఎమ్మెల్యే సహకారం లేకపోవడంతోనే దళితబంధు ఆగిపోయింది వాస్తవమన్నారు. నిరుపేద దళిత కుటుంబాలను ఆర్థికంగా నిలబెట్టడంతో పాటు వారికి జీవనోపాధి కల్పించడం కోసం మాజీ సీఎం కేసీఆర్ దళితబంధు పథకం అమలు చేసి ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు ఇచ్చారని, అందులో భాగంగా రెండో విడతలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తుంగతుర్తి నియోజకవర్గంలోని మోత్కూరు, అడ్డగూడూరు మండలాల్లో 254 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారని తెలిపారు. ఒక్కో లబ్ధిదారుని ఖాతాల్లో రూ.3 లక్షల చొప్పున నిధులు జమ చేయించారని, ఎన్నికలు వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం రావడం, ఎమ్మెల్యేగా సామేల్ గెలవడంతో లబ్ధిదారుల ఖాతాల్లో ఉన్న నిధులను గ్రౌండింగ్ చేయకుండా ఫ్రీజింగ్‌లో పెట్టారని తెలిపారు. సుమారు మూడేండ్లుగా లబ్ధిదారులు కలెక్టర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, ఎమ్మెల్యే సామేల్ చుట్టూ తిరుగుతున్నారని, అయినా కనికరించడం లేదన్నారు. 2025 జనవరిలో ఎస్సీ కార్పొరేషన్ ఎండీ జీవో ఇవ్వగా మిగతా జిల్లాల్లో కలెక్టర్లు లబ్ధిదారులకు నిధులు విడుదల చేశారని, కానీ యాదాద్రి జిల్లాలోని మోత్కూరు, అడ్డగూడూరు లబ్ధిదారుల ఖాతాలను మాత్రం ఫ్రీజింగ్‌లోనే పెట్టారని తెలిపారు. దళితబంధు లబ్ధిదారులంతా నా ఓటమి కోసం పని చేశారని, వారంతా బీఆర్ఎస్ కార్యకర్తలేనని ఎమ్మెల్యే మాట్లాడుతున్నారని, కానీ వారంతా దళిత బిడ్డలేనని మరిచిపోవద్దన్నారు. లబ్ధిదారుల ఖాతాలను ఫ్రీజింగ్‌లో పెట్టడంతో ఇతర ఏ పథకాలకు ఐదేళ్ల వరకు వారు అర్హత పొందలేని పరిస్థితి ఏర్పడిందని, రాజీవ్ యువశక్తి స్కీంకు కూడా దరఖాస్తు చేసుకోలేకపోయారని తెలిపారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పనిచేయాలన్న ఉద్దేశం లేదని, అయినా రెండున్నరేండ్లు ఓపిక పట్టామని, పైకి ఇస్తామని ఎమ్మెల్యే చెబుతున్నప్పటికీ ఇంకా కాలయాపన చేస్తే ఆయనకే మంచిది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంబేద్కర్ అభయహస్తం స్కీం పెట్టి రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చిందని, మాకు ఆ రూ.12 లక్షలు అవసరం లేదని, ఖాతాల్లో ఉన్న రూ.3 లక్షలకు మరో రూ.7 లక్షలు ఇస్తే చాలన్నారు. ఈ సమావేశంలో డీపీఎంసీ మెంబర్ దాసరి తిరుమలేష్, బందెల శ్రీను, కూరెళ్ల పరమేష్, చిప్పలపల్లి అంజయ్య, కూరెళ్ల రమేష్, సూరారం రాజు, దాసరి నరేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.